
# ప్రజాభూమి
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com

తెలంగాణ ఎడిటర్ : విప్పల చంద్రశేఖర్ | శుక్రవారం | 18.10.2024 | పేజీలు: 08 | నమూనా సంచిక | వెల : అముల్యం


## పకడ్బందీగా గ్రూప్ 1 పరీక్షలు
సీఎస్ శాంతి కుమారి సమీక్ష



2




# రేవంత్ ఉడుత ఊపులకు.. భయపడే ప్రసక్తే లేదు

## మూసీపై పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ఇస్తం

- మూసీకి మేము ఏం చేశామో వివరిస్తం
- గత పది నెలల్లో అత్యంత కష్టాకాలాన్ని ఎదుర్కొన్నం
- బాధితులంతా తెలంగాణ భవన్‌కు బాట పట్టారు
- ఇక మనం పోరాటం ప్రారంభించాల్సిందే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ సమావేశం

**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్**

రేవంత్‌రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే.. సమాజం తరపున కొట్లాడటం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడటం బంద్ అయితే తెలంగాణ మూగబోతదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే బీజేపీ మాట్లాడదని, బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడనేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు.

మిగతా 2లో..

# హైడ్రా.. ఒక హైడ్రామా

### హైడ్రా పేరుతో డబ్బులు వసూలు చేస్తుండ్రు

- పేదలనే టార్గెట్ చేసి ప్రభుత్వం హీనంగా ప్రవర్తిస్తోంది
- కూల్చివేతలతో
- పేదలంతా
- రోడ్డున పడ్డారు
- వారికి తక్షణమే ప్రభుత్వం పరిహారం చెల్లించాలి
- ఖమ్మం పర్యటనలో ఎంపీ ఈటల



**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్**

హైడ్రా విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి మండిపడ్డారు. గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన.. సర్కారు తీరుపై ఫైర్ అయ్యారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండేవి మొత్తం ప్రభుత్వ భూములు కావని, పట్టా భూములు కూడా ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేస్తున్నవి అన్ని అక్రమ నిర్మాణాలు కావని, హైడ్రా పేరుతో డబ్బులు వసూలు చేసే కార్యక్రమం జరుగుతోందని

మిగతా 2లో..

హామీలకే గతి లేదు..

## మూసీని సుందరీకరిస్తారా?

- సుందరీకరణకు, కూల్చివేతకు సంబంధమేంటి?
- టెక్నాలజీని వాడి మూసీ నీటిని మంచినీటిగా మార్చండి
- సర్కార్‌పై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల ఫైర్



2



2

## షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

- నవంబర్ 18లోగా అదుపులోకి తీసుకోవాలని కోర్టు ఆదేశాలు
- ప్రస్తుతం ఇండియాలోతలదాచుకుంటున్న బంగ్లా మాజీ ప్రధాని

## ట్రాఫిక్ నియంత్రణకు హైడ్రా సేవలు

**డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ**

2

- ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపైనా చర్యలకు సిద్ధం
- తొలగింపునకు త్వరలో స్పెషల్ డ్రైవ్
- ట్రాఫిక్ కమిషనర్‌తో ఏవీ రంగనాథ్ సమీక్ష



## అరెస్ట్ చేస్తున్నా.. ఆగని నిరసనలు

**కొనసాగుతున్న గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళన**

- పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్
- ఇప్పటికే 10 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

2





## మోగిన ఎన్నికల నగారా

- ఉత్తర తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు
- పోటీకి సిద్ధమవుతున్న పార్టీలు
- ఇండిపెండెంట్ల నుంచి తీవ్ర పోటీ
- ఇప్పటికే ప్రారంభమైన ఓటరు నమోదు

**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్**

ఉత్తర తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సెప్టెంబర్ 30న ఓటర్ల నమోదు ప్రక్రియ

మిగతా 2లో..



## ముఖ్యమంత్రి మాట తప్పిండు

- మాదిగలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలి
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

2



2

## పాకిస్తాన్‌కు మోడీ రావాల్సింది

- మాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్
- షాంఘై సహకార సదస్సుకు హాజరైన విదేశాంగ శాఖ మంత్రి

## మూడు నెలలు మూసీ ఒడ్డున ఉండండి

**అప్పుడు ప్రాజెక్టు ఆపేస్తాం**

- కేటీఆర్, ఈటల, హరీశ్‌రావుకు సీఎం రేవంత్ సవాల్
- మూసీ పునరుజ్జీవం కోసం మీ ప్రణాళికేంటో చెప్పండి
- కొందరు మెదడులో మూసీ మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు




2

## టీమిండియా చెత్త రికార్డు..

**37ఏళ్ల తర్వాత మరోసారి..**

- 46 పరుగులకే కుప్పకూలిన భారత్
- ఐదుగురు బ్యాటర్లు డకౌట్
- హడలెత్తించిన న్యూజిలాండ్ బౌలర్లు
- 1987లో ఢిల్లీ టెస్టులో 75 రన్స్‌కు ఆలౌట్
- రెండో రోజు ఆట ముగిసేసరికి కివీస్ 180/3




2



# పాకిస్తాన్‌కు మోడీ రావాల్సింది

ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్

పాకిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొనడంపై పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్పందించారు. ఇది సానుకూల పరిణామమన్నారు. ఈ సదస్సుకు ప్రధాని మోదీ వస్తే మరింత సంతోషించేవాడినన్నారు. భారత్‌కు చెందిన ఓ జాతీయ వార్తా ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన.. ఇరుదేశాలు గతాన్ని పక్కన పెట్టి.., ఇంధనం, వాతావరణ మార్పుల వంటి భవిష్యత్తు సవాళ్లను పరిష్కరించుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఎస్‌సీవో సదస్సు కోసం పాకిస్థాన్ వెళ్లిన భారత జర్నలిస్టులతో నవాజ్ షరీఫ్, ఆయన కుమార్తె మరియం నవాజ్‌లు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లాహోర్‌లోని ఆయన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పాకిస్థాన్‌లో పర్యటించడం తొలి అడుగుగా అభివర్ణించారు. ఇదిలాఉంటే, భారత జర్నలిస్టులతో షరీఫ్ ప్రత్యేకంగా సమావేశం కావడంపై కొన్ని పాక్ మీడియా సంస్థలు భిన్నంగా స్పందించాయి. తమ జర్నలిస్టులకూ అలాంటి అదృష్టం వస్తే బాగుండేదని పేర్కొనడం గమనార్హం.



# షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

# మూడు నెలలు మూసీ ఒడ్డున ఉండండి

ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్




తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. "మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టాం. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కిలో మీటర్లు ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీ మురికికంటే ఎక్కువ విషం నింపుకున్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేమలఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25 వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?" అని సీఎం ప్రశ్నించారు.

**ఆ ముగ్గురూ మూసీ ఒడ్డున ఉంటారా...?**

"మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆపేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి. మూసీ పునరుజ్జీవం కోసం మీ వద్ద ఉన్న ప్రణాళిక చెప్పండి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి"

# రేవంత్ ఉడుత ఊపులకు.. భయపడే ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.

**దోపిడీలో బిజీగా...**

'రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ నా వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో అతిపెద్ద బిల్డింగ్ కట్టాను.. కానీ 8 ఏండ్లలో మున్సిపల్ మంత్రిగా ఉన్న మిమ్మల్ని కలిసే అవసరం రాలేదు. కానీ ఇప్పుడు మొదటిసారి కలుస్తున్నాను. అప్పుడు కేసీఆర్ భయంతో అధికారులు పని చేసేవారు.. మంత్రులను కలిసే పరిస్థితి రాలేదు. కానీ ఇప్పుడు కరెంట్ కనెక్షన్ కోసం ఫోన్ చేసినందుకు రూ. 25 లక్షలు తీసుకున్నారు"అని ఓ బిల్డర్ తనకు చెప్పి బాధపడినట్లు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. "గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్‌కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే" అని అనుకుంటున్నారని, కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. మూసీపై శుక్రవారం సాయంత్రం 4.30గంటలకు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని కేటీఆర్ తెలిపారు. మూసీపై బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులు, మూసీ పునరుజ్జీవనం కోసం చేసిన ప్రయత్నాలు, ప్రణాళికలు వివరిస్తామన్నారు.

# అరెస్ట్ చేస్తున్నా.. ఆగని నిరసనలు

ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్

అశోక్‌నగర్‌లో గ్రూప్స్ అభ్యర్థులు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చారు. ఈ నెల 21 నుంచి జరగనున్న టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షలో తప్పులు, జీవో 29ను సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటివరకు 10మందిని అదుపులోకి తీసుకొని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**టీపీసీసీ చీఫ్‌తో భేటీ...**

గురువారం గ్రూప్ 1 అభ్యర్థులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్ లో పీసీసీ చీఫ్ తో భేటీ అయ్యారు. జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని, పాత జీవో ప్రకారం పరీక్షల నిర్వహణ జరగాలని, పాత నోటిఫికేషన్ లో ఇచ్చిన 503 పోస్టులో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వవద్దని, పెంచిన 60 పోస్టుల్లో మాత్రమే కొత్తగా అప్లై చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని, పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరి ప్రకారం పరీక్షలు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఈ విషయాలను తాను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత తీసుకుంటానని ఆయన చెప్పారు. గ్రూప్1 మెయిన్స్ పరీక్షలో ఇవాళ సాయంత్రం లోపుగా ప్రభుత్వం నుండి నిర్ణయం వచ్చే అవకాశం ఉందని ఆయన వారికి హామీ ఇచ్చారు.

**తెలంగాణ భవన్‌కు..**

గ్రూప్ 1 అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని తెలంగాణ భవన్ కు వెళ్లారు. ఈ మేరకు గ్రూప్ 1 అభ్యర్థులతో కేటీఆర్ భేటీ అయ్యారు. జీవో నెంబర్ 29 ను ఎత్తివేయాలని కొందరు అభ్యర్థులు కేటీఆర్‌ను కోరారు. ఈ జీవో వల్ల తమకు నష్టం జరుగుతుందని అభ్యర్థులు తెలిపారు. గ్రూప్ 1 మెయిన్స్‌ను వాయిదా వేసేలా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని అభ్యర్థులు కేటీఆర్ కు తెలిపారు. దీనిపై స్పందించిన కేటీఆర్ తప్పకుండా సహకరిస్తాం అని చెప్పారు. అభ్యర్థులు సుప్రీంకోర్టు కు వెళితే పార్టీ తరుపున అండగా ఉంటాం అని హామీ ఇచ్చారు.

# ట్రాఫిక్ నియంత్రణకు హైడ్రా సేవలు

ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్

విశ్వనగరంగా ఉన్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ట్రాఫిక్ విభాగంతో కలిసి హైడ్రా పని చేయాలని నిర్ణయించుకుంది. ఈమేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ నాంపల్లిలోని ట్రాఫిక్ అదనపు కమిషనర్ ఆఫీస్ లో ట్రాఫిక్ కమిషనర్ విశ్వవరప్రసాద్, ఇతర ట్రాఫిక్ పోలీసులతో కలిసి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి రివ్యూ మీటింగ్ లో చర్చించారు. డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని హైడ్రా నిర్ణయం తీసుకుంది. వర్షం పడ్డప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ప్రధాన రహదారులతో పాటు.. కాలనీల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఉన్న దుకాణాలను తొలగించనున్నారు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్లను, రహదారులను ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసిన వ్యాపారులకు సమాచారం ఇచ్చి వాటిని తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు.

**మరిన్ని అధికారాలు...**

హైడ్రాకు ఇటీవల ప్రభుత్వం మరిన్ని అధికారాలు కట్టబెట్టింది. ఇక నుంచి జీహెచ్ఎంసీ ఆస్తులను కూడా పరిరక్షించనుంది. జీహెచ్ఎంసీకి చెందిన రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ బాడీలు, బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ పార్కులు మొదలైన పబ్లిక్ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా రక్షించడానికి హైడ్రాకి అధికారాలు దక్కాయి.




జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ వరకూ ఉన్న 27 పురపాలికల్లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణకు అవసరమైన అధికారాలను హైడ్రాకు కట్టబెట్టింది. ఈ మేరకు బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు ఇచ్చారు.

# టీమిండియా చెత్త రికార్డు..

ప్రజాభూమి స్పోర్ట్స్ :

టెస్టు క్రికెట్‌లో టీమిండియా అత్యంత చెత్త రికార్డు నెలకొల్పింది. న్యూజిలాండ్ జట్టుతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్ లో భారత్ ఘోరంగా విఫలమైంది. కేవలం 46 పరుగులకే కుప్పకూలి చెత్త రికార్డును నెలకొల్పింది. ఇప్పటివరకు టెస్టుల్లో టీమిండియా అత్యల్ప స్కోరు 75 పరుగులు. 1987లో ఢిల్లీ టెస్టులో వెస్టిండీస్ పై భారత్ 75 పరుగులకే ఆలౌటైంది. దీంతో 37 ఏళ్ల తర్వాత మరసారి టీమిండియాపై చెత్త రికార్డు నమోదు అయ్యింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో భారత్ తడబడితే.. న్యూజిలాండ్ అదరగొడుతోంది. దీంతో తొలి టెస్టులో భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. తొలుత బంతితో అదరగొట్టిన కివీస్.. తర్వాత బ్యాటింగ్‌లోనూ సత్తా చాటుతోంది. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ జట్టు 3 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఓపెనర్ డేవాన్ కాన్వే (91, 105 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి శతకం ముంగిట పెవిలియన్ చేరాడు. విల్ యంగ్ (33), టామ్ లాథమ్ (15) పరుగులు చేశారు. క్రీజులో రచిన్ రవీంద్ర (22), డారిల్ మిచెల్(14)లు ఉన్నారు. ప్రస్తుతం న్యూజిలాండ్ 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, అశ్విన్ తలో వికెట్ పడగొట్టారు.

**హడలెత్తించిన కివీస్ బౌలర్లు...**

స్వదేశంలో తిరుగులేదని జోష్ మీదున్న భారత్‌కు దిమ్మదిరిగేలా కివీస్ బౌలర్లు దెబ్బకొట్టారు. వర్షం కారణంగా తొలిరోజు రద్దైన మొదటి టెస్టు రెండోరోజు ఆటలో మాత్రం టీమ్‌ఇండియా బ్యాటర్లు బెంబేలెత్తిపోయారు. ప్రస్తుతం లంచ్ బ్రేక్ సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 34 పరుగులు చేసింది. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై కివీస్ చెలరేగిపోయింది. పరుగుల సంగతి పక్కనపెడితే.. బంతిని ఎదుర్కోవాలంటే భారత బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. నలుగురు టాప్ క్లాస్ బ్యాటర్లు డకౌట్‌గా పెవిలియన్‌కు చేరడం గమనార్హం. ఈ క్రమంలో రిషభ్ పంత్ (20), యశస్వి జైస్వాల్ (13) కాసేపు పోరాడారు. అయితే, కివీస్ బౌలర్లు చెలరేగడంతో భారత్ 31.2 ఓవర్లలోనే 46 పరుగులకే ఆలౌటైంది. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 5 వికెట్లు, ఓరౌర్కీ నాలుగు వికెట్లు పడగొట్టగా.. టిమ్ సౌథీ ఓ వికెట్ తీశాడు.

**భారత్ లో ఆ ఆట లోపించింది: అనిల్ కుంబ్లే...**

న్యూజిలాండ్‌తో మొదలైన తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఘోరంగా విఫలమవడంపై మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులో ఒక రకమైన ఆటతీరు లోపించిందన్నాడు. భారత్ పూర్తిగా ఎదురు దాడి చేద్దామని ప్రయత్నించిందని అభిప్రాయపడ్డాడు. 'విరాట్ కోహ్లీ నాలుగో స్థానంలోనే బరిలోకి దిగాలి. ఆ స్థానంలో అతడే మీ టాప్ బ్యాటర్. ఇక 3వ స్థానం కోసం ఛతేశ్వర్ పుజారా వంటి ఆటగాడు అవసరం. కొన్నేళ్లపాటు నెంబర్3గా అతడు జట్టుకు సేవలు అందించాడు. నేడు పుజారా జట్టులో ఉంటే.. అలా వికెట్ పోగొట్టుకొనేవాడు కాదు. బంతి మీదకు వచ్చే వరకు ఆగి ఓపిగ్గా ఆడేవాడు. జట్టులో అలాంటి ఆటగాడు లోపించాడు. ఆ రకమైన ఆట లోపించింది. ఈ అంశంలో భారత్ కచ్చితంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది' అని కుంబ్లే పేర్కొన్నాడు.




# పకడ్బందీగా గ్రూప్ 1 పరీక్షలు

ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్

ఈనెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. గ్రూప్1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో నేడు సచివాలయం నుండి వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. గ్రూప్1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, దీనికోసం 46 పరీక్షా కేంద్రాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు, విస్తృత స్థాయిలో సీనియర్ అధికారులతో పర్యవేక్షణను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు నేరుగా ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారని, సంబంధిత పోలీస్ కమిషనర్లు కూడా తగు బందోబస్తు ఏర్పాట్లను చేపడుతారన్నారు. అన్ని శాఖల అధికారులు ఏవిధమైన స్వల్ప సంఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా ఈ పరీక్షల నిర్వహణా విధులు నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు.

# హామీలకే గతి లేదు.. మూసీని సుందరీకరిస్తారా?

ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్

ఇచ్చిన హామీలనే అమలు చేయకుండా.. ఇప్పుడు రూ. లక్షా 50 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ మీడియా చానెల్ తో మాట్లాడారు. మూసీ నదిని ప్రక్షాళన చేయడాన్ని తామేం తప్పుబట్టడం లేదని.. తాము కూడా చేయాలనే కోరుకుంటున్నామని అన్నారు. మూసీలోకి కెమికల్ నీళ్లు రాకుండా చూసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఇప్పుడున్న టెక్నాలజీని వాడి మూసీ నీటిని మంచినీటి మార్చాలని విజ్ఞప్తి చేశారు. అసలు మూసీ సుందరీకరణకు, మూసీ పరివాహక ప్రాంతాల ఇళ్ల కూల్చివేతకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని మీరు.. ఇచ్చిన హామీలు అమలు చేయలేని మీరు రూ.లక్షా 50 వేల కోట్లు పెట్టి మూసీని అభివృద్ధి చేస్తారా? అని ఈటల రాజేందర్ విమర్శించారు.

# హైడ్రా.. ఒక హైడ్రామా

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. కాగా గతంలోనూ బుల్డోజర్లతో ఇళ్లను కూలగొట్టి కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఈటల విమర్శించారు. కేవలం పేదలనే టార్గెట్ చేసి ప్రభుత్వం హీనంగా ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు శని, ఆదివారాల్లో కోర్టులు అందుబాటులో ఉండవని కూల్చివేతలు చేస్తున్నారన్నారు. చెరువులు కాపాడాలంటే ముందు ప్రభుత్వ, ప్రైవేటు భూములు లెక్కించాలని డిమాండ్ చేశారు. కూల్చివేతలతో రోడ్డున పడ్డ పేదలకు తక్షణమే ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కుమ్ములాటలు ఉన్నాయని, అవి బయటపడకుండా ఉండేందుకు హైడ్రా పేరుతో డైవర్షన్ చేస్తున్నారని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల భూములు లాక్కోవడానికి రేవంత్ రెడ్డి జాగీరు కాదన్నారు. చెరువులు, వాగుల రక్షణ కోసం అవసరమైతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రి మాట తప్పిండు

ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్

మాదిగలకు ఇచ్చిన హామీను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోలేదని, సర్కార్‌పై మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాల్సింది మాదిగ, ఉపకులాలకు పిలుపునిస్తున్నామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. "ఈ ఏడాది ఆగస్టు1వ తేదీన నిండు శాసనసభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తొలుత దేశంలో తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తదని హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ రిజర్వేషన్ల అమల్లో పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ముందు వసరులో ఉన్నాయి. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండా పోయింది. మాదిగల పట్ల ఆయన మాటలు తేనే పూసినట్టు ఉంటాయి. కానీ అవి మాకు తీపిని అందించవు. మాకు చేదుగానే, మోసంగానే ఉంటాయి. అన్ని నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని రేవంత్ రెడ్డి శాసనసభా వేదికగా చెప్పాడు. దీన్ని కూడా ఆయన విస్మరించారు. 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసి అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించారు. ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే అంతకుముందున్న నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేస్తామన్న రేవంత్.. అది అమలు చేయకుండానే నియామక పత్రాలు అందజేశారు" మందకృష్ణ తెలిపారు.

# మోగిన ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభం అయింది. నవంబర్ 6 వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో 20 లక్షల మంది పట్టభద్రులు ఉన్నట్లు అంచనా. అందులో 50 శాతానికి పైగా ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పోటీకి ఆసక్తి చూపే వారు జోరుగా సభ్యత్వ నమోదు సాగిస్తున్నారు. ఓటర్ల నమోదుతోనే సత్తా చాటే పనిలో నిమగ్నమయ్యారు. విద్యాసంస్థలు డాక్టర్లు, ఉద్యోగులు, నిరుద్యోగ యువతను కలిసి మద్దతు కూడగట్టుకుంటూ ఓటర్లుగా నమోదు చేయిస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీలో నిలిచేది ఎవరో స్పష్టంగా తెలియకపోయినప్పటికీ ఎవరికి వారే తమ అభ్యర్థిత్వం ఖరారు అవుతుందని ప్రచారం సాగిస్తున్నారు.

**కరీంనగర్ లో పోటీ ఎక్కువ...**

కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ నాలుగు ఉమ్మడి జిల్లాలతో ముడిపడి ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీకి సిద్ధమైన వారిలో ఎక్కువ మంది కరీంనగర్ కు చెందినవారే ఉన్నారు. ఇప్పటికే డజన్ మంది పేర్లు తెరపైకి వచ్చాయి. ప్రముఖ విద్యావేత్త ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ కు చెందిన వెలిచాల రాజేందర్ రావు, బిఆర్ఎస్ నేత మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బిజెపి నాయకులు పి.సుగుణాకర్ రావు, ట్రస్మా ప్రతినిధి యాదగిరి శేఖర్ రావు, ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ బి.ఎన్.రావు, డాక్టర్ హరికృష్ణ, ప్రసన్న హరికృష్ణ, పోకల నాగయ్య పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అందులో నరేందర్ రెడ్డి, రవీందర్ సింగ్, సుగుణాకర్ రావు, శేఖర్ రావు, ప్రసన్న హరికృష్ణ ముమ్మరంగా ఓటర్ల నమోదు ప్రక్రియను చేపట్టారు. మార్నింగ్ వాక్ తో పట్టభద్రులను, ఉద్యోగులను, విద్యాసంస్థల ప్రతినిధులను కలుస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఓటర్ల నమోదు తో సత్తా చాటేపనిలో నిమగ్నమయ్యారు.

**కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు...**

కాంగ్రెస్ నుంచి ప్రస్తుతం ఇద్దరు పేర్లు వినిపిస్తున్నాయి. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన వెలిచాల రాజేందర్ రావు పోటీకి ఆసక్తి చూపుతున్నారు. రాజేందర్ రావు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తానని అంటున్నారు. నరేందర్ రెడ్డి 2018 లో కాంగ్రెస్ చేరారు. అప్పటి నుంచి కాంగ్రెస్ సభ్యునిగా కొనసాగుతున్న నరేందర్ రెడ్డి ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తు ఓటర్ నమోదు తో ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఒకవేళ పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్ గా పోటీ చేసేందుకు సైతం సిద్ధమై జోరుగా సభ్యత్వ నమోదు తో ప్రచారం సాగిస్తున్నారు. అందుకు ఆయన గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుని సభ్యత్వ నమోదుతో సత్తా చాటేందుకు వంద మందితో ప్రత్యేకంగా నెట్వర్క్ ఏర్పాటు చేశారు. మిస్డ్ కాల్ ఇస్తే చాలు ఓటర్ గా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించారు. ఏడు నుంచి ఎనిమిది లక్షల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నారు.

**బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇద్దరు...**

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తోపాటు యాదగిరి శేఖర్ రావు, డాక్టర్ బి.ఎన్.రావు, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ ఆసక్తి చూపుతున్నారు. గులాబీ దళపతి మాజీ సీఎం కేసిఆర్ ఇప్పటికే సర్దార్ రవీందర్ సింగ్ కు అభయం ఇవ్వడంతో జోరుగా సభ్యత్వ నమోదు తో ప్రచారం సాగిస్తున్నారు. వ్యక్తిగత పరిచయాలతో పాటు కార్పొరేటర్ గా, మేయర్ గా న్యాయవాదిగా పనిచేసిన అనుభవం ఉండడంతో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పట్టభద్రులను వేడుకుంటున్నారు.

**బీజేపీ నుంచి సుగుణాకర్ రావు...**

ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నుంచి పోటీ చేసేందుకు కిసాన్ మోర్చా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి న్యాయవాది సుగుణాకర్ రావు సిద్ధమై సభ్యత్వ నమోదును ముమ్మరం చేపట్టారు. ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాలో నాలుగు పార్లమెంటు స్థానాల్లో బిజెపి గెలుపొందడం... ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాలో పలువురు పార్టీకి ఎమ్మెల్యేలు ఉండడంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయని భావిస్తూ సుగుణాకర్ రావు అవిశ్రాంతంగా సభ్యత్వం నమోదు సాగిస్తున్నారు. సుగుణాకర్ రావు తో పాటు రాణి రుద్రమ, భోగ శ్రావణి పేర్లు వినిపిస్తున్నప్పటికీ ఇప్పటివరకు వారు ఎక్కడ సభ్యత్వ నమోదు చేస్తున్న దాఖలాలు లేవు. ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్ గా పోటీ చేసేందుకు ఆసక్తి చూపేవారు ఎక్కువ మందే ఉన్నారు. కానీ ప్రస్తుతం సభ్యత్వ నమోదులో కరీంనగర్ లోనే డజన్ మంది కనిపిస్తుండడంతో రాజకీయంగా ఎన్నికల హీట్ ను పెంచుతుంది.



# గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తిని సన్మానించిన దొబ్బల బిక్షపతి...

**ప్రజాభూమి ప్రతినిధి, చిగురుమామిడి:**

సిద్దిపేట జిల్లా గ్రంధాలయ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేడం లింగమూర్తి గురువారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు రామంచ గ్రామానికి చెందిన దొబ్బల బిక్షపతి సిద్దిపేటలో జరిగిన కార్యక్రమానికి తరలివెళ్లి చైర్మన్ కేడం లింగమూర్తికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.చైర్మన్ లింగమూర్తి కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని,కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని బిక్షపతి ఆశాభావం వ్యక్తం చేశారు.మంచి మనసున్న చైర్మన్ లింగమూర్తి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని,మరెన్నో పదవులు ఆశించాలని వారు కోరారు.హుస్నాబాద్ నియోజకవర్గం మంత్రి పొన్నం ప్రభాకర్ తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బిక్షపతి తెలిపారు.



# పాలనలో రేవంత్ సర్కార్ ఫెయిల్..

**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం:**

తెలంగాణ ప్రభుత్వం ఊసరవెల్లి మాటలతో ప్రజలను మభ్యపెడుతుందని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న అన్నారు. గురువారం మండల కేంద్రం గన్నేరువరం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో అకాల వర్షాలకు దాన్యం తడిసి ముద్దయిందని తెలిపారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ప్రభుత్వ వైఫల్యం వల్లే ధాన్యం వర్షానికి తడిసిందని గంప వెంకన్న విమర్శించారు. ఖరీఫ్ కాలం గడిచిపోయిందని రబీ సాగుకు రైతులు సిద్ధమవుతున్న ఇప్పటి వరకు రైతు భరోసా లేదని ప్రశ్నించారు. సన్నవడ్లతో పాటు దొడ్డు వడ్లకు 500 బోనస్ లు ఇవ్వాలని గంప వెంకన్న డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ వడ్లకు బోనస్ ను అమలు చేసే వరకు రైతుల పక్షాన పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మడుగుల రవీందర్ రెడ్డి, నాయకులు న్యాత సుధాకర్, పుల్లెల లక్ష్మణ్,గొల్లపల్లి రవి, బద్దం తిరుపతిరెడ్డి, బొడ్డు బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.





# మా ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం

- కేరైతును రాజు చేయాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పం
- ప్రభుత్వ మద్దతు ధరకు చివరి గింజ వరకు ధాన్యాన్ని కొంటాం
- సన్నరకం వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్
- రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- మామిడిపెల్లి, నిజామాబాద్ గ్రామల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాభూమి ప్రతినిధి, కోనరావుపేట:**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని, రైతును రాజు చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పమని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం కోనరావుపేట మండలం మామిడిపెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, నిజామాబాద్ గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పజెప్పడం జరిగిందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీ ఫైల్ పై తొలి సంతకం చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోళ్ళు ఆలస్యమయ్యాయని, దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. ప్రస్తుతం సమయానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని, క్షేత్ర స్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రైతులకు మేలు కలిగే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో చేపడుతామని అన్నారు. రైతు భరోసా త్వరలోనే ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన చేశారని గుర్తు చేశారు. రుణమాఫీ లో భాగంగా సుమారు 18 వేల కోట్ల రూపాయలను 22 లక్షల మంది ఖాతాల్లోకి జమ చేశామని తెలిపారు. సాంకేతిక సమస్య వల్ల కొందరు రైతుల ఖాతాల్లో జమ కాలేదని, అవి జమ చేయడానికి వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డులు లేని వారిని గుర్తించి వారికి 31 వేల కోట్ల ద్వారా రుణమాఫీ వర్తింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రస్తావించారు. రైతుల సంక్షేమం కోసం ఆనాడు రాజశేఖర్ రెడ్డి అహర్నిశలు శ్రమించేవాడని, అదే స్ఫూర్తితో ప్రస్తుతం రేవంత్ రెడ్డి గారు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో పెట్టిన 9 ప్రాజెక్టుల్లో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉందని, మన ప్రాంతంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా మరింత సస్యశ్యామలం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మల్కపేట రిజర్వాయర్ లో నీటిని నింపి కోనరావుపేట మండలంలోని సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. 17 శాతం తేమ వచ్చాక ధాన్యం తూకం వేయడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందిని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ధాన్యం అమ్మిన తర్వాత రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అన్నారు..

*అదునవు కలెక్టర్ కిమ్యా నాయక్ మాట్లాడుతూ*రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఎక్కడో అమ్ముకోకుండా రైతు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.. రైతులు దళారులను మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని తెలిపారు.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.. ధాన్యం కొనుగోలు చేశాక 48 గంటల్లో రైతులకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు..జిల్లా పరిధిలో 258 కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.. రైతులకు సరిపడా గన్ని సంచులు తూకం వేశాక లారీల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.. సంబంధిత ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటారని, ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే వారి దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం ప్రతీ కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్లు, ప్యాడీ క్లీనింగ్ మెషీన్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో డిఆర్డీఓ శేషాద్రి,అధికారులు, ప్యాక్స్ చైర్మన్ నర్సయ్య,పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# ముస్తాబాద్ లోని మహర్షి హై స్కూల్ గుర్తింపు రద్దు

## జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ -17 ప్రజాభూమి:**

ముస్తాబాద్ లో ఉన్న మహర్షి హై స్కూల్ గుర్తింపు రద్దు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు.ముస్తాబాద్ మండల విద్యాశాఖ అధికారి అందించిన నివేదిక ప్రకారం నర్సరీ చదువుతున్న చిన్నారి మనోజ్ఞ,తండ్రి పేరు భూమయ్య ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు టైర్ కిందపడి అక్కడికక్కడే మరణించిందని, ఈ సంఘటన స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్, మహర్షి హై స్కూల్ మేనేజ్మెంట్ నిర్లక్ష్యపు వైఖరి కారణంగా జరిగిందని తేలింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రతి పాఠశాలకు తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, పి.డబ్ల్యూ.డి శాఖ నుంచి భవన స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ ఉండాలని, మహర్షి హై స్కూల్ మేనేజ్మెంట్ పేర్కొన్న సర్టిఫికెట్లు సబ్మిట్ చేయలేదని అన్నారు.

పాఠశాల వాహనం పార్కింగ్ , మెయింటెనెన్స్ అంశంలో రవాణా శాఖ జారీ చేసిన మెమోలోని సూచనలు , మార్గదర్శకాలను మహర్షి హై స్కూల్ యాజమాన్యం పాటించలేదని, పిల్లల రవాణా సమయంలో స్కూలు యాజమాన్యం పాటించాల్సిన జాగ్రత్తలు సైతం పాటించడంలో వైఫల్యం చెందారని, దీని కారణంగా ఒక పసి ప్రాణం చిన్నారి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు.మహర్షి హై స్కూల్ కు సరైన బిల్డింగ్ అనుమతులు సర్టిఫికెట్ లేవని , రవాణా సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు పాటించడం లేదని, పాఠశాలలోని పిల్లలకు సిబ్బంది ప్రాణాలకు ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకొని ముస్తాబాద్ లోని మహర్షి హై స్కూల్ గుర్తింపు వెంటనే రద్దు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

# శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలి

**ప్రజాభూమి ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల:**

ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి జయంతి ఉత్సవాలలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆది కవి వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బోయవాణిగా జీవితం గడిపిన వాల్మీకి నారద మహర్షి దివ్య ఉపదేశంతో ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహా గ్రంధాన్ని 24 వేల శ్లోకాలతో ఆది కావ్యంగా పూర్తి చేసిన గొప్ప వ్యక్తి శ్రీ మహర్షి వాల్మీకి అని అన్నారు. మనుషుల్లో మంచి మార్పు వస్తే గొప్ప వారీగా ఎదగడంలో శ్రీవాల్మీకి మహర్షి మనందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. మన చరిత్రను మలుపు తిప్పిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఆదర్శవంతులుగా జీవించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, బిసి వెల్ఫేర్ అధికారి రాజమనోహ



# ధాన్యం కోనుగోలు కేంద్రాలలో సరైన వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ
- టార్పాలిన్ కవర్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి
- నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర పై కొనుగోలు
- కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామంలో ఏర్పాటు చేయుచున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ప్రజాభూమి ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల:**



ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలలో సరైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామంలో ఏర్పాటు చేయుచున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ రోజు నుండి ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా గన్ని బ్యాగుల స్టాక్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు.

నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై కొనుగోలు చేసి వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని,సన్న బియ్యం కొనుగోలు సమయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులకు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతుల కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, టెంట్, కుర్చీలు వంటివి ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, పౌర సరఫరాల మేనేజర్ రజిత, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాస మూర్తి, తదితరులు ఉన్నారు.




# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

**ప్రజాభూమి ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలసి పాల్గొన్నారు.. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం స్వామి వారి రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు.. విప్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఆ స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకొన్నారు.




గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న సీఎం కప్ 20 24 పోటీలకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహిస్తున్న క్రీడాజ్యోతి టార్చి రిలే ర్యాలీ ఈరోజు సూర్యాపేట కేంద్రంలో విజయవంతంగా కొనసాగింది విద్యార్థులు యువ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్:తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పవార్ పలువురు జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



# రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా పోటు మల్లారెడ్డి నియామకం

**ప్రజాభూమి ప్రతినిధి, చిగురుమామిడి:**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక సమావేశంలో కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పోటు మల్లారెడ్డిని నియమిస్తూ రెడ్డి సంఘాల జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రాన్ని పోటు మల్లారెడ్డికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోటు మల్లారెడ్డి మాట్లాడుతూ రెడ్డి హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని,రెడ్డి సంఘాల అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని మల్లారెడ్డి తెలిపారు.రానున్న కాలంలో రెడ్ల కష్టాలలో,ఆపదలో పాలుపంచుకుంటానని పోటు మల్లారెడ్డి చెప్పారు.రెడ్డి సంఘం సభ్యులు సామాజిక,ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తానని చెప్పారు.తన నియామకానికి కృషి చేసిన సంఘం పెద్దలకు మల్లారెడ్డి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సమావేశంలో చిగురుమామిడి మండల రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు కాటం సంపత్ రెడ్డి,సంజీవరెడ్డి,పన్యాల వాసుదేవారెడ్డి, జంగా రాజిరెడ్డి సంధి రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం జరిగే వరకు పోరాటం అపొద్దు



## బ్రిడ్జి జేఏసీ నేతల తీర్మానం

**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం :**

అఖిల పక్షం ఆద్వర్యంలో బ్రిడ్జి జేఏసీ నాయకుల సమావేశం మండల కేంద్రము లోని ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి జేఏసీ నాయకులు మాట్లాడుతూ గన్నేరువరం నుండి కరీంనగర్ కు బ్రిడ్జి ఏర్పాటు సాధనకై కార్యాచరణ రూపొందించుటకు గన్నేరువరం , ఇల్లంతకుంట , బెజ్జంకి మండలాలకు సంబంధించిన అఖిలపక్షం నాయకులతో కలిసి రాబోయే రోజుల్లో ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.బ్రిడ్జి ని సాధించుట కోసం ఎంత టి పోరాటమైన చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు .ఈ అఖిల పక్ష సమావేశంలో బ్రిడ్జి జేఏసీ చేర్మెన్ సంపతి ఉదయ్ కుమార్, గాండ్ర శ్రీనివాస్ రావు , తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ గౌడ్ , బామండ్ల రవీందర్, కాంతాల అంజి రెడ్డి. నూకల చింటు దోనే వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, దొంగల జగన్ ,సంపత్ ,సతీష్, అంజయ్య, పర్శరాములు, చంద్రయ్య ,పెద్ద మల్లయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.



# అడుగుకో గుంత..
# నడిచేదెట్లా..?



## బురదమయంగా మారిన మేడ్చల్ పారిశ్రామిక ప్రాంత రోడ్లు
## పట్టించుకోని అధికారులు
## ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, మేడ్చల్ :**

మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతం ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. కురిసిన వర్షంతో రోడ్లపై నీరు ఎక్కడికక్కడే నిలిచి బురద మయంగా మారాయి. పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే కార్మికు లు అటుగా వెళ్లే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. బురద లో నుంచే రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులకు గురవు తున్నారు. చర్యలు తీసుకోవలసిన టీజీఐఐసీ అధికారులు పట్టిం చుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

### కాంగ్రెస్ నేతలు
### తూప్రాన్ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి
### మృతదేహాలను బంధువుల కు అప్ప గించిన వైద్యులు



**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, తూప్రాన్,**

శివ్వంపేట మండలంలో బుధవారం జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఏడుగురి మృత దేహాలకు తూప్రాన్ సీహెచ్‌సీలో గురువారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించా రు. మృతదేహాలను తరలించే సమయంలో ప్రమా దానికి కారణమైన వ్యక్తి రావాలంటూ బాధితులు ఆందోళన చేపట్టారు. కావాలని చంపాడని ఆరోపిం చారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నర్సాపూ ర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఇతర నాయకులు వారితో మాట్లాడి సముదాయించి మృత దేహాలను వారి ఊళ్లకు తరలించారు. ప్రభుత్వం అన్ని రకాలుగా వారికి అండగా ఉండాలని వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని మృతుల కుటుంబీకు లు, బంధువులు కోరారు.

**మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిలు తెలిపారు. తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి గురువారం చేరుకుని బా ధితులను పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. చికిత్స పొందుతున్న నామ్‌సింగ్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, దౌల్తాబాద్ :**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని దీపాయంపల్లి, శేరిప ల్లి బందారం గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ అన్నారెడ్డిగారి వెంకటరెడ్డితో కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో కూడా గతంలో 10 సంవత్సరా ల్లో ఎక్కడ కూడా ఏ రైతుకి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిందన్నారు. అదే తరహాలో ఇప్పుడు కూడా ఈ ప్రభుత్వం కూడా తీసుకోవాలన్నారు. మద్దతు ధరతో చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధి కారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో ధాన్యం కాంటాలు వేయడం, గన్ని బ్యాగుల కొరత రాకుండా చూడాలన్నారు. కార్య క్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్, పీఏసీఎస్ డైరెక్టర్లు చిక్కుడు సత్యానా రాయణ, నల్ల ఆంజనేయులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బండారు లాలు, స్టీవెన్ రెడ్డి, రణం శ్రీని వాస్ గౌడ్, డప్పు శివరాజ్, నర్రరాజేందర్, జనా



# నూతన విధానంతో ధాన్యం కొనుగోళ్లు

## 483 కేంద్రాల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు


## 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు టార్గెట్

**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, మెదక్ :**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సారి నూతన పద్ధతిలో ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అక్రమాలకు తావివ్వకుండా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఐరిస్ తో కొనుగోలు చేసే నూతన విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ సీజన్ ఈ విధానంతో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని అధికారులు వెల్లడిస్తున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు వాటికి ఉపయోగించే పరికరాలు సంబంధిత శాఖ జిల్లా కేంద్ర కార్యాలయానికి చేరాయి. దీంతో ధాన్యాన్ని విక్రయించే రైతు తప్పని సరిగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. నిర్వాహ కులు సదరు రైతు ఐరిస్ తీసుకున్న తర్వాతే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తారు. రైతు పూర్తి వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తారు. ఏ కారణం చేతనైనా రైతు కేంద్రానికి రాకపోతే ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిలిచిపోతుంది. సర్కార్ ప్రతి కేంద్రంలో రెండు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నది. సన్న ధాన్యం ఒక క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్న నేపథ్యంలో సన్న, దొడ్డు రకం ధాన్యం నిర్ధారణ బాధ్యతలను ఏఈవోలు చూసు కోనున్నారు.

### 47 రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం...

ఈ సారి కేవలం 47 రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం పంపిస్తామని ఇప్పటికే కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో సంభందిత శాఖ అధీనంలో 46 లక్షల గిన్నె బ్యాగులు అందు బాటులో ఉండగా 18 లక్షల సంచులు మిల్లుల్లో వున్నాయి. ఈ సీజన్ లో ధాన్యం సేకరణకు కోటి గన్నీ బ్యాగులు అవసరమని ఇప్పటికే పౌర సరఫరాలశాఖ అధికారులు అంచనా వేశారు. ఇవి కాక మరో 36 లక్షల సంచులు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొనుగోలు ప్రక్రియకు 12 వేల టార్పాలిన్లు, 450 ప్యాడీ క్లీనర్లు, 450 డ్రయ్యర్లు, 650 తేమ యంత్రాలు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 483 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్ లో జిల్లా వ్యాప్తంగా 2.97 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. దీనిలో సన్న రకం 1,04,970 ఎక రాలు, దొడ్డు



రకం 1,92,365 ఎకరాల్లో సాగు అయింది. కాగా సన్నరకం 2,30,964 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 5,19,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికా రులు అంచనా వేస్తున్నారు. ఈసారి సన్నరకం ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. వచ్చే దిగుబడి అంచనాలను బట్టి జిల్లాలో 483 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతు న్నాయి. వీటిలో సన్న రకం కేంద్రాలు 93 కాగా, దొడ్డు రకం కేంద్రాలు 390. నవంబర్ మొదటి వారం నుంచి వరి కోతలు మొదలుకానున్న నేపథ్యంలో కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

# అక్షర యోధుడు షోయబుల్లాఖాన్‌కు ఘన నివాళి

## రాయపోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పుట్టరాజు



**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, దౌల్తాబాద్ :**

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలంతో ప్రశ్నించిన నికార్సైన కలంవీరుడు షోయబుల్లాఖాన్. నేటి జర్నలిస్టులకు షోయబుల్లాఖాన్ ఎంతో స్ఫూర్తిదాయకమని రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రం ప్రెస్ క్లబ్‌లో షోయబుల్లాఖాన్ 104వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమసమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపనతో షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచుకొని మొదట షోయబ్ 'తేజ్' అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాదకుడిగా చేరాడన్నారు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, అతని తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచకాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను సంధించాడన్నారు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడన్నారు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు. తేజ్ పత్రిక తర్వాత మందుముల నర్సింగరావు ఆధ్వర్యంలో వెలువడుతున్న 'రయ్యత్' అనే ఉర్దూ దినపత్రికలో చేరాడు. పాలకవర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడని అన్నారు. 'పగటి ప్రభుత్వం రాత్రి ప్రభుత్వం' పేరుతో 1948 జనవరి 29 న ఒక వ్యాసంలో ఇత్తెహాదుల్ ముసల్మీన్ సంస్థపై ఎందుకు నిషేధం విధించదు ? అంటూ తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించిన ధైర్యశీలి షోయబుల్లాఖాన్. అలాంటి కలం వీరుడినీ నేటి జర్నలిస్టులు స్ఫూర్తిదాయంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ప్రెస్ క్లబ్ కోశాధికారి నర్సింహులు, జర్నలిస్టు సభ్యులు మన్నె గణేష్, కనుక స్వామి, ప్రజా సంఘాల నాయకులు లింగం శ్రీకాంత్ నవీన్ భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, మెదక్ :**

మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మహర్షి వాల్మీకి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ రాముడి దివ్య చరిత్రను మానవాళికి అందించిన వాల్మీకి మహర్షి మానవీయ విలువలను ప్రతిపాదిస్తూ ఆ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించిన జ్ఞాన ఘని అని కొనియాడారు. వేదాల సారాంశాన్ని, రాముని ఆదర్శాన్ని ప్రపంచానికి రామాయణం రూపంలో అందించిన 'ఆది కవి వాల్మీకి మహర్షి జయంతి' సందర్భంగా జిల్లా ప్రజలందరికీ మహర్షి వాల్మీకి జయంతిని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రామాయణాన్ని రచించి, ఆది కవిగా పేరు ప్రఖ్యాతలు గావించిన వాల్మీకి మహర్షి సంస్కృత సాహిత్యంలో అతను మొదటి పురాణ గాథను రచించారని, అందుకే ఆయనకు ఆదికవి అనే బిరుదు ఉందన్నారు. వాల్మీకి రచించిన రామాయణానికి జీవితంలో నైతిక, ఆధ్యాత్మిక విలువలు నేర్పే జీవిత పాఠంగానూ గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, మినిస్టీరియల్ సిబ్బంది సూపరింటెండెట్ మణి, వలియా నాయక్, అనురాధ, సలీం, సాగర్, సీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్బీ సీఐ సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలేందర్, ఎఆర్ ఎస్ఐ నరేష్, భవానీ కుమార్, మహిపాల్ పాల్గొన్నారు.


# ధాన్యం కొనుగోలు ప్రారంభం



**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి,నార్సింగి:**

ఐకేపీ ఏపీఎం అశోక్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద తాండా, నర్సంపల్లి, నార్సింగి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక తహశీల్దార్ షేక్ కరీం, ఎంపీడీవో ఆనంద్‌లు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోస పోవద్దన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం తేమ 17 శాతం ఉండాలని, రైతులు తమ వడ్లను ఆరబోసుకుని తేమ శాతం సరిపడేలా చూసుకోవాలని అన్నారు. ఏ గ్రేడ్ రకానికి 2320 రూ, సాధారణ రకానికి 2300 రూ క్వింటా కు ధర , సన్నరకానికి 500 రు బోనస్ గా నిర్ణయించిందని, రైతులు ధాన్యం కాంటా వేసే టప్పుడు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని, ధాన్యం తూకం వేసిన 48 గంటలలో రైతు ఖాతాలో డబ్బులు జమ చేయబడుతాయని వివరించారు. రైతులు తమ వంతు సహకారం అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా టార్పోలిన్ కవర్లు, మంచి నీరు, తూకం వేసిన ధాన్యం తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ శంకర్ యాదవ్, సుల్తానా, వీఓఏ మంగా, లక్ష్మి నర్సవ్వ, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు



**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి,నార్సింగి:**

మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం షేక్ కరీం మాట్లాడుతూ ఈ మహాకవి వాల్మీకి హిందూ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని, దాని ద్వారా సమాజానికి విలువలను అందించారని, మానవీయ విలువలను ప్రపంచానికి అందించిన మహాజ్ఞాని వాల్మీకి అని కొనియాడారు. మతాలకతీతంగా అందరూ అనుసరించ వలసిన ఆదర్శ కావ్యం రామాయణం అని అన్నారు. రామాయణ గ్రంధాన్ని రచించిన వాల్మీకి జీవిత చరిత్రలను తెలుసుకొని, స్ఫూర్తిని పొందాలని ఈ సందర్భంగా తహసీల్దార్ షేక్ కరీం పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గిర్ధావర్ నవీన్ రావు, జూనియర్ అసిస్టెంట్ సరిత, రికార్డు అసిస్టెంట్ బాలయ్య, కంప్యూటర్ ఆపరేటర్ మహేష్, కార్యాలయ సిబ్బంది సాయి కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లా స్థాయి

# కళా ఉత్సవ్ పోటీలు



**ప్రజాభూమి ప్రధాన ప్రతినిధి, మెదక్ :**

జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో మెదక్ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం పాటల పోటీ, థియేటర్ పోటీలు, కథా కథనం పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీలలో మొదటి స్థానం పొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వాయిద్యాల పోటీల్లో అఖిల్, మెదక్ ప్రథమ స్థానం సాధించగా, ద్వితీయ స్థానం రాజు, తృతీయ స్థానం సతీష్ కుమార్ నిలిచారు. కథా కథనం పోటీల్లో ప్రథమ స్థానం అర్చిత, ద్వితీయ స్థానం నేతాజీ, తృతీయ స్థానం సాయి చరణ్ విజేతగా నిలిచారు. నృత్య పోటీలలో ప్రథమ స్థానం ఐశ్వర్య, ద్వితీయ స్థానం హాసిని, తృతీయ స్థానం మేఘన విజేత ల నిలిచారు. డ్రామా పోటీల్లో ప్రథమ స్థానం సింధు గ్రూపు, ద్వితీయ స్థానం గాయత్రి గ్రూప్, తృతీయ స్థానం పల్లవి గ్రూప్ విజేతలు అయ్యారు. పాటల పోటీలలో ప్రథమ స్థానం జీవన్, ద్వితీయ స్థానం శరవయ్య, తృతీయ స్థానం జ్యోతి విజేతలు అయ్యారు. చిత్ర లేఖనం పోటీలో ప్రథమ స్థానం రుచిత, ద్వితీయ స్థానం స్పందన, తృతీయ స్థానం అంజి కుమార్ విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి నీలకంఠం, జిల్లా పరీక్షల విభాగం అధికారి రామేశ్వర ప్రసాద్, ఏఎస్ఓ నవీన్ కుమార్ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం, న్యాయ నిర్ణేతలు నర్సింగ రావ్, అంజా గౌడ్, మాధవ రెడ్డి, ప్రవీణ్, రమణ కుమార్, వంశీ, శశిధర్ గౌడ్, గోపాల్, సిద్ధి రాములు, లక్ష్మీ ప్రసన్న , శ్రీకాంత్, ఉండ్రాల రాజేశం పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడిగా కాంతాల సత్యనారాయణ రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం:**

కరీంనగర్ జిల్లా, గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన కాంతాల సత్యనారాయణ రెడ్డి ని తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా శాఖ కరీంనగర్ గౌరవ అధ్యక్షుడిగా నియమించడం జరిగింది. సత్యనారాయణ రెడ్డి గతంలో జిల్లా శాఖలో కార్యదర్శిగా, 8 సంవత్సరాలు ఉపాధ్యక్షునిగా పదవులను పొంది నేడు గౌరవ అధ్యక్షుడిగా పదవి పొందడం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా శాఖ గౌరవ అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాలకు అనుకూలంగా జిల్లా, మండల కమిటీల ఏర్పాటుకై తగిన సమయం కేటాయిస్తూ ఎల్లప్పుడూ రెడ్ల సంక్షేమం, వారి సమస్యల సాధన కోసం రాష్ట్ర, జిల్లా కమిటీల సలహాలు, సూచనలు పాటిస్తూ అలాగే కమిటీల నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు జరిగే విధంగా నిస్వార్థంగా పనిచేస్తానని, బాధ్యతయుతంగా ఉంటానని కమిటీ ఆదేశాలను పాటిస్తానని తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన మర్రిపల్లి గౌడ సంఘం సభ్యులు

**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ:**

వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ను మర్రిపల్లి గౌడ కులస్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎల్లమ్మ దేవాలయ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను గౌడ కులస్థులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



## 17వ లైబ్రరీని ప్రారంభించిన ఆకర్షణ సతీష్

**ఆకర్షణను అభినందించిన స్కూల్ టీచర్లు.. 25 లైబ్రరీ ఓపెనింగ్ కు ప్రధాని మోదీ**

**ప్రజాభూమి ప్రతినిధి,బన్సీలాల్ పేట్:**

బేగంపేట లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో 8వ తరగతి చదువుతున్న 13 ఏండ్ల విద్యార్థిని ఆకర్షణ సతీష్ తన 17వ లైబ్రరీని సిటీలోని నాగారం లోని సెరినిటీ మోడల్ హైస్కూల్ లో ప్రారంభించింది. ఈసందర్భంగా తన తరపున 425 కొత్త పుస్తకాలను ఈ కొత్త లైబ్రరీకి అందచేశారు. రాబోవు 2025 మార్చి నాటికి మొత్తం 25 లైబ్రరీలను ఏర్పాటు చేయాలనేది తన లక్ష్యమని ఆకర్షణ మీడియాకు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 17 లైబ్రరీలకు 11 వేల పుస్తకాలను సేకరించి, విరాళంగా ఇచ్చిందన్నారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆకర్షణ కలవగా, మోదీ ఆమెను మనసారా అభినందించారు. నేటి కాలంలో పరులకు జ్ఞానం పంచిపెట్టాలనే చక్కటి గొప్ప ఆలోచన కలిగి ఉన్న ఆకర్షణ అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆకర్షణ 25వ లైబ్రరీ ఓపెనింగ్ కు తాను స్వయంగా వస్తానని ప్రధాని మోదీ హామినిచ్చినట్లు ఆకర్షణ తండ్రి సతీష్ తెలిపారు. తమ మోడల్ స్కూల్ లో ఆకర్షణ లైబ్రరీని ప్రారంభించి,



కొత్త పుస్తకాలను ఇవ్వడం ఆనందంగా ఉందని, స్కూల్ నిర్వాహకులు తెలిపారు. చిన్న వయస్సులో పరోపకారం చేయడం చాలా గొప్పవిషయమన్నారు. స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు పరామర్శ

**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ:**

వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన అన్నాడి బుచ్చి రామవ్వ కుటుంబ సభ్యులను, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హన్మాజీపేట గ్రామానికి చెందిన విక్కుర్తి దిలీప్, సుర అనిల్ కుటుంబ సభ్యులను వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో అర్థాంతరంగా మృతి చెందడం పట్ల ద్రిగ్బాంతి వ్యక్తం చేశారు.. ఆ భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని ఆయన ప్రార్థించారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ:**

పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని చంద్రగిరి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సందెల సతీశ్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామానికి చెందిన సందెల మమతకు గురువారం సీఎం సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు అందజేశారు. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## అలయ్ బలయ్‌ని విజయవంతం చేయాలి..

**మండల అధ్యక్షుడు గంప వెంకన్న పిలుపు**

**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం:**

ఈనెల 20వ తేదీన తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి సాయి రాం గార్డెన్ లో జరిగే బీఆర్ఎస్ పార్టీ అలయ్ బలయ్ కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని గన్నేరువరం బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంప వెంకన్న కోరారు. ఈ సందర్భంగా గన్నేరువరం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో జరగబోయే అలయ్ బలయ్ కార్యక్రమం రాష్ట్రంలో నియంతృత్వ విధానాలతో కొనసాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం పై జంగ్ సైరన్ లా నిలిచి కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపేలా ఉండబోతోందని గంప వెంకన్న అన్నారు.

ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన బొడ్డు బాలయ్యను శాలువాతో సన్మానించారు.ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి ,న్యాత సుధాకర్,పుల్లెల లక్ష్మణ్, గొల్లపల్లి రవి, అట్టికం రవి గౌడ్, బద్దం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీకి చెందిన మొహమ్మద్ సలీంకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60 వేల చెక్కును మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సాబీర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ యూసుఫ్, మొహమ్మద్ అఫ్రోజ్, మొహమ్మద్ రియాజ్ షేక్, అలీమ్, షేక్ సాదిక్ పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్ ద్వారా పేద రెడ్డిలకు న్యాయం జరిగే వరకు నిరంతర పోరాటం

**రెడ్డి ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు వంచ సుదర్శన్ రెడ్డి**

**ప్రజాభూమి ప్రతినిధి, కరీంనగర్:**

రెడ్డి కార్పొరేషన్ కు చైర్మన్ ను నియమించి నిధులు విడుదల చేసేదాకా తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని తద్వారా పేద రెడ్డి విద్యార్థులకు పేద రెడ్డి ప్రజలకు న్యాయం జరిగే దాకా ఉద్యమిస్తామని రెడ్డి ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వంచ సుదర్శన్ రెడ్డి అన్నారు గురువారం కరీంనగర్లోని ఆర్విఆర్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక కరీంనగర్ జిల్లా శాఖ పూర్తిస్థాయి విస్తరణ సమావేశం జిల్లా అధ్యక్షులు వంచ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది రెడ్డి ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్ రాష్ట్రంలో అన్ని రంగాల్లో సరిగా అమలు కాక పేదరెడ్డి విద్యార్థులు నష్టపోతున్నారని అన్ని విభాగాల్లో ఈడబ్ల్యూఎస్ ని అమలు చేయాలని డిమాండ్ చేశారు సంఘం గౌరవాధ్యక్షులు కాంతాల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మొన్నటి డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ సరిగా అమలు కాక పేద రెడ్డిలకు అన్యాయం జరిగిందని దానిని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు మండలాల్లో తాసిల్దారులు సర్టిఫికెట్లు ఇవ్వక సతాయిస్తున్నారని తమ సంఘం దృష్టికి వచ్చిందని అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు అనంతరం రెడ్డి ఐక్యవేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వంచ సుదర్శన్ రెడ్డి చింతల శ్రీనివాస్ రెడ్డిలు బాడీ మెంబర్స్ కు నియామక పత్రాలు అందించారు సంఘం గౌరవాధ్యక్షులుగా కాంతాల సత్యనారాయణ రెడ్డి ,గౌరవ సలహాదారుగా ద్యా



వభాస్కర్ రెడ్డి జిల్లా మీడియా సెల్ కన్వీనర్ గా జాలి శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షులుగా పోటు మల్లారెడ్డి నర్ర శ్రీనివాస్ రెడ్డి ఏరుగోపాల్ రెడ్డి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా కంకణాల అశ్విని రెడ్డి సంయుక్త కార్యదర్శులుగా బైరెడ్డి వెంకటరమణారెడ్డి కొమ్మెర రవీందర్ రెడ్డి చిగురుమామిడి మండల అధ్యక్షులుగా కాటము సంపత్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులుగా చామకూర సంపత్ రెడ్డి తల్లపాపిరెడ్డి ఇల్లంతకుంట మండల అధ్యక్షులుగా అబ్బిడి చంద్రారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ గా కోస్న వేణుగోపాల్ రెడ్డి లకు నియామక పత్రాలను అందించారు

## భీమేశ్వర స్వామి వారి సేవలో పారా అథ్లెట్



**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ:**

వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని గురువారం పారా అథ్లెట్ దీప్తి శివాంజీ కుటుంబ సమేతంగా దర్శించుకొని సేవలో తరించారు. అనంతరం తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి కరీంనగర్ అధ్యక్షుడు ఓదెల నరేష్ వారిని కలుసుకొని సన్మానించారు. ఆ దేవదేవుళ్ళ ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. పారా ఒలంపిక్స్ లో కాంస్య పథకం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచింది.


## రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ:**

పదేండ్లుగా విధ్వంసమైన ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజు నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టింది అని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస అన్నారు. వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూపది నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన రుణాలు రూ.49618 కోట్లు అని,పాత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిన వడ్డీలు, కిస్తీలు రూ.56,440 కోట్లు అని అన్నారు.గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసింది, వాటికి ప్రతి నెలా చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలే ప్రభుత్వానికి గుదిబండగా మారాయని అన్నారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు,అంటే డిసెంబర్ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 49618 కోట్ల మార్కెట్ రుణాలు తీసుకుంది అని,అందులో నుంచి పాత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ. 56440 కోట్లు రీపేమెంట్లు (అసలు, వడ్డీలు కలిపి కిస్తీలు) తిరిగి చెల్లింపులు చేసింది అని అన్నారు.అంటే ఈ పది నెలల్లో కొత్త ప్రభుత్వం తెచ్చిన అప్పులు గత ప్రభుత్వం చేసిన అప్పుల కిస్తీలు, వడ్డీలకు కూడా సరిపోలేదు అని అన్నారు. మా ప్రభుత్వం తెలంగాణ ప్రజలపై ఉన్న రుణభారం తగ్గించేందుకు కొత్త ప్రభుత్వం ప్రయత్నించిన తీరు ఆర్థిక క్రమశిక్షణకు అద్దం పట్టింది అని అన్నారు. అప్పులు తీర్చటంతో పాటు ఈ పది నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.21881 కోట్ల క్యాపిటల్ ఎక్స్పెండిచర్ నమోదు చేసింది అని,ప్రజోపయోగమైన నిర్మాణాలకు, పనులకు మరో రూ. 21881 కోట్లు మూలధన వ్యయంగా ఖర్చు చేయటం గమనార్హం అని అన్నారు.ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసింది అని, రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ, రైతు భరోసా, చేయూత, ఎల్పీజీ సబ్సిడీ, మహాలక్ష్మి, గృహజ్యోతి, విద్యుత్ సబ్సిడీ, బియ్యం సబ్సిడీ, ఆర్టీసీ, కళ్యాణలక్ష్మి పథకాలకు రూ.54346 కోట్లు ఖర్చు చేసింది అని అన్నారు.wగత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు వడ్డీలు కలిపి తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సగటున ఒక రోజుకు రూ. 181 కోట్లు ఖర్చు పెట్టింది అని గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా చేసిన అప్పులకు వడ్డీలు, కిస్తీలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చినట్లు స్పష్టమవుతోంది అని అన్నారు. పదేండ్లలో రాష్ట్ర ఖజానాపై మోయలేనంతగా పెరిగిన రుణభారం తగ్గించేందుకు ప్రయత్నాలు చేసింది అని, గత ప్రభుత్వం చేసినట్లుగా ఇష్టారాజ్యంగా అప్పుల జోలికి వెళ్లకుండా నియంత్రణ పాటించింది అని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఆడంబరాలకు పోకుండా ప్రభుత్వం ఉంది అని, బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు తీసుకొని ప్రణాళిక ప్రణాళికేతర ఖర్చులకు సరిపడేలా సర్దుబాటు విధానం అనుసరించింది అని, గతంతో పోలిస్తే అప్పులు తగ్గుముఖం పట్టడం శుభసూచకం.అప్పులను నియంత్రించటంలో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించింది అని అన్నారు.



# తొలి రోజు ఆట వర్షార్పణం



టీమ్ఇండియాను వర్షం వదలట్లేదు. ఇటీవల బంగ్లాదేశ్‌తో రెండో టెస్టుకు మూడు రోజుల పాటు తీవ్ర అంతరాయం కలిగించిన వరుణుడు.. ఇప్పుడు న్యూజిలాండ్‌తో తొలి టెస్టుకూ అడ్డు పడ్డాడు. బెంగళూరులో భారీ వర్షం కురుస్తుండడంతో తొలి రోజు ఆట సాధ్యపడలేదు. టాస్ వేయడానికి కూడా అవకాశం లేకపోయింది. వర్షం వల్ల చిన్నస్వామి స్టేడియంలో ముందు రోజు రెండు జట్లు ప్రాక్టీస్ చేయలేకపోయిన సంగతి తెలిసిందే. బుధవారం కూడా వర్షం పడొచ్చన్న అంచనాలకు తగ్గట్లే ఉదయం నుంచి వరుణుడి ప్రతాపం సాగింది. టాప్ వేయాల్సిన 9 గంటల సమయంలో భారీ వర్షం పడింది. తర్వాత నాలుగు గంటలకు పైగా వర్షం తెరపినివ్వలేదు.
మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో వరుణుడు శాంతించాడు. 1.50కి మైదానంలో కొన్ని కవర్లను తొలగించారు. తర్వాత అంపైర్లు పరిశీలనకు వచ్చారు. స్టేడియంలో పలు చోట్ల వర్షం మడుగులు ఉండడంతో ఆట సాధ్యం కాదని అర్థమై మధ్యాహ్నం రెండున్నరకు తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. వర్షం పడుతున్నప్పటికీ ఉదయం నుంచి పెద్ద సంఖ్యలోనే అభిమానులు స్టేడియానికి చేరుకున్నారు. స్టేడియం లోపల సాధన చేసేందుకు వెళ్తూ విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్ కనిపించడం వారికి ఉత్సాహాన్నిచ్చింది. జోరు వర్షం పడుతుండగా సహాయకులు భారీ గొడుగు పట్టి కోహ్లి, జైస్వాల్‌లను తీసుకెళ్లారు. ఆ సమయంలో అభిమానులు కోహ్లి కోహ్లి అంటూ గట్టిగా నినాదాలు చేశారు. గురువారం కూడా మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించవచ్చు. రెండో రోజు ఉదయం 8.45కే టాస్ వేసి 9.15కి ఆటను ఆరంభించాలని అంపైర్లు నిర్ణయించారు.



## టీమ్ ఇండియా ఓపిగ్గా ఆడలేదు

### జట్టు నిర్ణయాలపై కుంబ్లే అసంతృప్తి

న్యూజిలాండ్‌తో మొదలైన తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఘోరంగా విఫలమై కేవలం 46 పరుగులకే కుప్పకూలడంపై మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులో ఒక రకమైన ఆటతీరు లోపించిందన్నాడు. భారత్ పూర్తిగా ఎదురు దాడి చేద్దామని ప్రయత్నించిందని అభిప్రాయపడ్డాడు. "విరాట్ కోహ్లి నాలుగో స్థానంలోనే బరిలోకి దిగాలి. ఆ స్థానంలో అతడే మీ టాప్ బ్యాటర్. ఇక 3వ స్థానం కోసం ఛతేశ్వర్ పుజారా వంటి ఆటగాడు అవసరం. కొన్నేళ్లపాటు నెంబర్3గా అతడు జట్టుకు సేవలు అందించాడు. నేడు పుజారా జట్టులో ఉంటే.. అలా వికెట్ పోగొట్టుకొనేవాడు కాదు. బంతి మీదకు వచ్చే వరకు ఆగి ఓపిగ్గా ఆడేవాడు. జట్టులో అలాంటి ఆటగాడు లోపించాడు. ఆ రకమైన ఆట లోపించింది. ఈ అంశంలో భారత్ కచ్చితంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది" అని కుంబ్లే పేర్కొన్నాడు.
దాదాపు పదేళ్లపాటు టీమ్ ఇండియా టెస్ట్ జట్టు బ్యాటింగ్‌లో మూడో స్థానాన్ని పుజారా బలోపేతం చేశాడు. 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ తర్వాత జట్టుకు దూరమయ్యాడు. గిల్ అతడి స్థానంలో టీమ్ ఇండియాలోకి వచ్చాడు. టీమ్ కుప్పకూలిపోయే పరిస్థితుల్లో ఉన్నప్పుడు పుజారా కాపాడిన సందర్భాలు కోకొల్లలు. తన బలమైన డిఫెన్స్‌తో జట్టుకు అండగా నిలిచాడు.
తాజాగా న్యూజిలాండ్ మ్యాచ్‌కు గిల్ దూరం కావడంతో కోహ్లీ ఓ స్థానం ముందుకు వచ్చి నెంబర్3గా దిగాడు. ఈ స్థానంలో బరిలోకి దిగడం ఎనిమిదేళ్లలో ఇదే తొలిసారి. రోహిత్ వికెట్ పడగానే మైదానంలోకి వచ్చిన అతడు పరుగులేమీ చేయకుండానే పెవిలియన్‌కు చేరుకొన్నాడు. వాస్తవానికి నెంబర్3లో కోహ్లీ ప్రదర్శన ఏమీ అంతగొప్పగా లేదు. ఆరు మ్యాచ్‌ల్లో ఈ స్థానంలో బరిలోకి దిగి 16.16 సగటుతో కేవలం 97 పరుగులు మాత్రమే చేశాడు. ఈ స్థానంలో అతడు డకౌట్ కావడం ఇదే తొలిసారి.
బెంగళూరులోని చిన్నస్వామి మైదానంలో భారత్‌కు న్యూజిలాండ్ బౌలర్లు చుక్కలు చూపించారు. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 31.2 ఓవర్లలోనే 46 పరుగులకే ఆలౌటైంది. ఐదుగురు బ్యాటర్లు డకౌట్ కావడం గమనార్హం. ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.




## కివీస్‌తో తొలి టెస్టు.. నలుగురు డకౌట్.. లంచ్ బ్రేక్‌కు భారత్ స్కోరు 34/6

స్వదేశంలో తిరుగులేదని జోష్ మీదున్న భారత్‌కు దిమ్మదిరిగేలా కివీస్ బౌలర్లు దెబ్బకొట్టారు. వర్షం కారణంగా తొలిరోజు రద్దైన మొదటి టెస్టు రెండోరోజు ఆటలో మాత్రం టీమ్ఇండియా బ్యాటర్లు బెంబేలెత్తిపోయారు. ప్రస్తుతం లంచ్ బ్రేక్ సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 34 పరుగులు చేసింది. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై కివీస్ చెలరేగిపోయింది. పరుగుల సంగతి పక్కనపెడితే.. బంతిని ఎదుర్కోవాలంటే భారత బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. నలుగురు టాప్ క్లాస్ బ్యాటర్లు డకౌట్‌గా పెవిలియన్‌కు చేరడం గమనార్హం. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (13), రిషభ్ పంత్ (15*) మాత్రమే ఇప్పటివరకు డబుల్ డిజిట్ సాధించిన బ్యాటర్లు. రోహిత్ శర్మ కేవలం 2 పరుగులే చేయగా.. విరాట్, సర్ఫరాజ్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా పరుగుల ఖాతా తెరవలేదు. కివీస్ బౌలర్లు విలియమ్ ఓరౌర్క్ (3/13), మ్యాట్ హెన్రీ (2/12), టిమ్ సౌథీ (1/8) భారత బ్యాటర్లను వణికించారు.

**1969 తర్వాత..**

సొంత గడ్డపై ఆరు వికెట్లను కోల్పోయి తక్కువ పరుగులు చేయడం భారత్‌కు ఇది రెండోసారి. చివరిసారిగా 1969లో న్యూజిలాండ్‌పైనే 27 పరుగులకే టీమ్ఇండియా ఆరు వికెట్లను కోల్పోయింది. హైదరాబాద్ వేదికగా ఆ మ్యాచ్ జరగడం గమనార్హం. ఓవరాల్‌గా భారత్ అత్యంత తక్కువ స్కోరుకే ఆరు వికెట్లను కోల్పోవడం ఇది ఆరోసారి. అదే విధంగా స్వదేశంలో 10 పరుగుల్లోపే భారత్ మూడు వికెట్లను నష్టపోవడం ఇది మూడోసారి. కివీస్‌పైనే అన్నిసార్లూ ఈ చెత్త రికార్డును టీమ్ఇండియా దక్కించుకుంది. మొహాలీ వేదికగా 1999లో 7 పరుగులు, అహ్మదాబాద్ వేదికగా 2010లో 2 పరుగులకే భారత్ మూడు వికెట్లను కోల్పోయింది.

'ఇక మీరిద్దరు టెస్టుల్లోనూ రిటైరైతే బెటర్'..

## భారత స్టార్ ద్వయంపై ట్రోలింగ్

టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలైంది. న్యూజిలాండ్‌తో (IND vs NZ) మొదటి టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 2 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన విరాట్ కోహ్లి పరుగుల ఖాతా తెరవలేదు. దీంతో వారిద్దరిని టార్గెట్ చేస్తూ విమర్శలు వచ్చాయి. బౌలర్లకు సహకరిస్తున్న పిచ్‌పై టాస్ నెగ్గిన రోహిత్ బ్యాటింగ్ తీసుకోవడం ఏంటని ప్రశ్నలూ తలెత్తాయి. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 46 పరుగులకే ఆలౌట్ కాగా.. ఐదుగురు బ్యాటర్లు డకౌట్‌గా పెవిలియన్‌కు చేరారు. బాధ్యతగా ఆడాల్సిన సమయంలో వికెట్‌ను ఇచ్చేయడంపై రోహిత్‌పై క్రికెట్ అభిమానులు విమర్శనాస్త్రాలు సంధించారు. బంగ్లాదేశ్‌తో టెస్టులో కనీసం 30 పరుగులు కూడా చేయలేదని.. ఇప్పుడు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం దారుణమని వ్యాఖ్యలు చేస్తున్నారు.


"రోహిత్, విరాట్ మీరు టీ20లకు వీడ్కోలు పలికారు. టెస్టుల్లోనూ పక్కకు వైదొలిగి కుర్రాళ్లకు ఛాన్స్ ఇవ్వండి"

"విరాట్‌కు అదృష్టం కలిసిరాలేదు. కానీ, రోహిత్ అలాంటి షాట్ కొట్టకుండా ఉండాల్సింది. పిచ్ చాలా ట్రికీగా ఉన్నప్పుడు అనవసర షాట్లకు వెళ్లకుండా ఉండాలి"

"ఇన్నాళ్లుగా టెస్టు క్రికెట్ ఆడింది చాలు. ఇకనైనా యువ క్రికెటర్లకు మార్గం చూపించు"

"గత పది ఇన్నింగ్స్‌ల్లో విరాట్ కోహ్లి ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. అతడు జట్టులో ఉండటం నష్టమే. ఇలాగే కొనసాగితే ఫ్యాబ్ 4 నుంచి తొలగాల్సి ఉంటుంది"

"రోహిత్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించడం తప్పులేదు. కానీ, పరిస్థితులను అంచనా వేయాలి. పిచ్ బౌలింగ్‌కు బాగా సహకరించింది. అలాంటి సమయంలో కాస్త ఓర్పు ప్రదర్శిస్తే బాగుండేది"



## హర్మన్‌పై వేటు?




టీ20 ప్రపంచకప్‌లో మరోసారి భారత జట్టుకు నిరాశ తప్పలేదు. 2020లో రన్నరప్‌గా నిలిచిన టీమ్ఇండియా ఈసారి కనీసం సెమీస్ కూడా చేరలేదు. యూఏఈలో జరుగుతున్న టోర్నీలో ఫేవరెట్లలో ఒకటనుకున్న హర్మన్‌ప్రీత్ సేన.. తొలి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్ చేతిలో చిత్తుగా ఓడి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. తర్వాత బలహీన పాకిస్థాన్, శ్రీలంకలను ఓడించినప్పటికీ.. చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి తప్పలేదు. మొత్తంగా టోర్నీలో భారత్ ప్రదర్శన సాధారణం. ఈ నేపథ్యంలో జట్టును ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సారథ్యంలో జట్టు ఒక స్థాయికి మించి ఎదగలేకపోతోందనే విమర్శలు కొంచెం గట్టిగానే వినిపిస్తున్నాయి. మాజీ కెప్టెన్ మిథాలి రాజ్ కూడా ఇదే మాట అంది. బీసీసీఐ సైతం కెప్టెన్‌ను మార్చడంపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. నాయకత్వ మార్పు జరగని పక్షంలో జట్టు ఆటతీరులో కూడా మార్పు తీసుకురావడం కష్టమని.. ప్రపంచకప్ వైఫల్యం మీద సమీక్ష జరగడం, చర్యలు చేపట్టడం కూడా చాలా అవసరమని, లేదంటే జట్టులో ఉదాసీనత పెరిగిపోతుందని బోర్డులో చర్చ జరుగుతోందట. ప్రస్తుతం జట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న స్మృతి మంధానకు నాయకత్వ బాధ్యతలు అప్పగించవచ్చని.. జట్టు దృక్పథాన్నే మార్చే లక్ష్యంతో షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్ లాంటి యువ క్రికెటర్ల వైపు కూడా చూసే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. జట్టులో కూడా కొన్ని మార్పులు జరగొచ్చని సమాచారం.



## తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌట్..

### 92 ఏళ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో చెత్త రికార్డు

స్వదేశంలో తిరుగులేదని భావిస్తున్న భారత్‌కు న్యూజిలాండ్ బౌలర్లు షాక్ ఇచ్చారు. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 31.2 ఓవర్లలోనే 46 పరుగులకే ఆలౌటైంది. ఐదుగురు బ్యాటర్లు డకౌట్ కావడం గమనార్హం. ఇద్దరు మాత్రమే డబుల్ డిజిట్ స్కోరు చేశారు. రిషభ్ పంత్ (20), యశస్వి జైస్వాల్ (13) కాసేపు పోరాడారు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 5 వికెట్లు, ఓరౌర్కే నాలుగు వికెట్లు పడగొట్టగా.. టిమ్ సౌథీ ఓ వికెట్ తీశాడు.

**బౌలింగ్‌కు సహకారం..**

గత రెండు రోజులుగా వర్షం పడటంతో పిచ్ బౌలర్లకు మంచి సహకారం అందించింది. ఆరంభం నుంచే కివీస్ పేసర్లు కట్టుదిట్టంగా బంతులేశారు. ఓపెనర్లు రోహిత్ శర్మ (2), యశస్వి జైస్వాల్ (13) ఆచితూచి ఆడారు. దాదాపు ఆరు ఓవర్లపాటు వికెట్ ఇవ్వలేదు. కానీ, రోహిత్ ఎటాకింగ్ చేసి కివీస్ బౌలర్లను దెబ్బ కొడదామని భావించాడు. కానీ, సీనియర్ బౌలర్ సౌథీ ఇన్‌స్వింగర్‌తో రోహిత్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన కోహ్లి (0), సర్ఫరాజ్ ఖాన్ (0) కివీస్ ఫీల్డర్ల దెబ్బకు పెవిలియన్‌కు చేరక తప్పలేదు. వారు ఇచ్చిన క్యాచ్‌లను అద్భుతంగా ఒడిసిపట్టారు. రిషభ్ పంత్ (20)తో కలిసి యశస్వి జైస్వాల్ వికెట్ పతనాన్ని అడ్డుకొన్నాడు. దాదాపు 11 ఓవర్లపాటు వికెట్ ఇవ్వలేదు. అయితే, యశస్వి ఏకాగ్రత కోల్పోయి ఔటయ్యాడు. ఇక ఆ తర్వాత భారత ఇన్నింగ్స్ కుప్పకూలడానికి మరింత సమయం పట్టలేదు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే పెవిలియన్‌కు చేరారు. ఆఖర్లో సిరాజ్ (4*) బౌండరీ కొట్టాడు. మొత్తం ఇన్నింగ్స్‌లో ఇది నాలుగో బౌండరీ మాత్రమే. రిషభ్ 2 కొట్టగా.. ఒకటి యశస్వి బ్యాట్ నుంచి వచ్చింది.





## ఫ్లైట్ అయితే మాకేంటి.. ఎక్కడైనా చేస్తాం!

టాలీవుడ్ హీరోయిన్, తెలుగుమ్మాయి అనన్య నాగళ్ల వరుస సినిమాలతో దూసుకెళ్తోంది. ఈ ఏడాదిలో ఇటీవలే తంత్ర, డార్లింగ్ లాంటి చిత్రాలతో ఫ్యాన్స్‌ను అలరించింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పొట్టేల్ మూవీతో ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ చిత్రంలో యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటిస్తున్నారు. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రాన్ని నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ నిర్మించారు. కాగా.. పొట్టేల్ చిత్రాన్ని తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో  రూపొందించారు. అయితే ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు మూవీ టీమ్. రిలీజ్ తేదీ దగ్గర పడుతుండడంతో పొట్టేల్ చిత్రబృందం వచ్చినా ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఏకంగా వారు ప్రయాణించే ఫ్లైట్‌లోనే సినిమా ప్రమోషన్స్ నిర్వహించారు. ఫ్లైట్‌లో కూర్చుని ఉన్న ప్రయాణికులకు పొట్టేల్ మూవీ పోస్టర్లను అందజేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ఆడ చేస్తాం ఈడ చేస్తాం యాడైన చేస్తాం' అంటూ అనన్య నాగళ్ల వీడియోను ట్విటర్‌లో పంచుకుంది. కాగా.. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 25న థియేటర్లలో సందడి చేయనుంది. కాగా.. 2019లో విడుదలైన 'మల్లేశం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ, తెలుగమ్మాయి అనన్య నాగళ్ల. ఆ తర్వాత  పవన్ కల్యాణ్ చిత్రం 'వకీల్ సాబ్'తో మరింత ఫేమస్ అయింది. గతేడాది సమంత లీడ్ రోల్ పోషించిన శాకుంతల చిత్రంలోనూ అనన్య ఓ పాత్రలో అభిమానులను మెప్పించింది.

## ఈ ఒక్క హిట్టూ బానే కలిసొచ్చిందిగా..

ఇటీవల వచ్చిన 'మత్తు వదలరా 2' సినిమాలో ఓ డైలాగ్ ఉంటుంది. వెన్నెల కిషోర్‌తో ఓ అమ్మాయి పలికే డైలాగ్ అది. ఆ డైలాగ్ అందరికీ గుర్తుండే ఉంటుంది కదా.. 'సినిమాలో హీరోయిన్.. అంటే జస్ట్ 4 పాటలు, దానికి ముందు వచ్చే సన్నివేశాల్లో కనిపిస్తుంది' అన్నట్టు ఆ పాత్ర చెబుతుంది. ఆ డైలాగ్ రియల్ లైఫ్ లో చూసుకుంటే.. కావ్య థాపర్‌కి కరెక్ట్ గా సెట్ అయిందేమో అనిపిస్తుంది. ఎందుకంటే 2018లో 'ఈ మాయ పేరేమిటో' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన కావ్య థాపర్ కి.. ఆ తర్వాత 'ఏక్ మినీ కథ'తో గుర్తింపు లభించింది. ఆ సినిమా నేరుగా ఓటీటీలో రిలీజ్ అయ్యింది. అయినప్పటికీ ఈ అమ్మడికి బాగానే కలిసొచ్చింది. వరుసగా 'బిచ్చగాడు 2' 'ఈగల్', 'ఊరు పేరు భైరవకోన', 'డబుల్ ఇస్మార్ట్' వంటి సినిమాల్లో నటించింది. ఇందులో 'ఈగల్' 'డబుల్ ఇస్మార్ట్' పెద్ద డిజాస్టర్స్ అయ్యాయి. మిగిలినవి హిట్లని కాదు. 'బిచ్చగాడు 2' కమర్షియల్ గా ఓకే అనిపించినా.. 'ఊరు పేరు భైరవకోన' యావరేజ్ సినిమా అనిపించుకుంది. ఇక కావ్య నటించిన లేటెస్ట్ మూవీ 'విశ్వం' అయితే 'ఈగల్' 'డబుల్ ఇస్మార్ట్'..లతో పోలిస్తే పర్వాలేదు అనిపించుకుంది. కానీ బాక్సాఫీస్ వద్ద సో సో గానే పెర్ఫార్మ్ చేస్తుంది. ఇంకో విషయం ఏంటంటే.. కావ్య చేసిన ఈ సినిమాల్లో.. ఆమె పాత్రలు కూడా గొప్పగా ఉండవు. అయినప్పటికీ గ్లామర్ వడ్డించడానికి ఈ అమ్మడు ఎప్పుడూ ముందుంటుంది. అందుకోసమే అనుకుంట ఆమెకు వరుస సినిమాల్లో ఛాన్సులు లభిస్తున్నాయి. ఇప్పుడు కూడా కావ్యకి 2 మిడ్ రేంజ్ సినిమాల్లో ఛాన్సులు లభించాయట. వాటి గురించి త్వరలోనే అనౌన్స్మెంట్ వచ్చే అవకాశం ఉంది.





## వాళ్ల పేర్లు కూడా ఇచ్చా.. అయినా వినలేదు

టాలీవుడ్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ఈ సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేయగా.. ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రియాంక చోప్రా, రిచర్డ్ మాడెన్ జంటగా నటించిన అమెరికన్ స్పైయాక్షన్ సిరీస్ సిటాడెల్‌కు ఇండియన్ వర్షన్‌గా ఈ సిరీస్ రూపొందించారు. అయితే, ఈ సిరీస్ ప్రమోషన్లతో బిజీగా ఉన్న సమంత తాజా ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. తాను మయోసైటిస్‌తో బాధపడుతున్న సమయంలో ఈ సిరీస్‌లో నా ప్లేస్‌లో వేరొకరిని తీసుకోవాలని దర్శకులైన రాజ్, డీకేలకు చెప్పానని సామ్ తెలిపింది. అంతే కాకుండా తన స్థానాన్ని భర్తీ చేయగల నటిని కూడా సిఫార్సు చేశానని వెల్లడించింది. కానీ తన విజ్ఞప్తిని వాళ్లిద్దరు తిరస్కరించారని సమంత పేర్కొంది. సమంత మాట్లాడుతూ.. 'ఈ సిరీస్ నేను చేస్తానని  నిజంగా అనుకోలేదు. అందుకే నా ప్లేస్‌లో మరొకరిని తీసుకోమని వారిని వేడుకున్నా. నేను చేయలేనని నేను కచ్చితంగా చెప్పా. ఆ పాత్రకు తగిన వారి పేర్లను కూడా పంపా. కానీ వాళ్లు నా స్థానంలో వేరొకరిని తీసుకునేందుకు నిరాకరించారు. ఇప్పుడు ఈ సిరీస్‌లో తాను నటించినందుకు సంతోషంగా ఉంది. దర్శకులు తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు' తెలిపింది. కాగా.. సమంత గతేడాది మయోసైటిస్ వ్యాధి బారిన సంగతి తెలిసిందే. అమెరికా వెళ్లి చికిత్స తీసుకుని కోలుకుంది. ప్రస్తుతం వరుణ్ ధావన్‌తో కలిసి సిటాడెల్: హనీ బన్నీ వెబ్ సిరీస్‌లో కనిపించనుంది. ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.

## ఎమర్జెన్సీ విడుదలకు లైన్ క్లియర్..

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన పొలిటికల్ డ్రామా 'ఎమర్జెన్సీ'. ఇప్పటికే జూలైలోనే విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడుతూ వస్తోంది. గతనెల సెప్టెంబర్ 6న థియేటర్లలోకి వస్తుందని భావించినప్పటికీ.. ఊహించని విధంగా మరోసారి పోస్ట్‌పోన్ అయింది. దీంతో ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం లేదని ఫ్యాన్స్ అంతా ఫిక్స్ అయిపోయారు. తాజాగా తన అభిమానులకు కంగనా రనౌత్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎమర్జెన్సీ చిత్రానికి సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ జారీ చేసినట్లు ట్విటర్ ద్వారా ప్రకటించింది. మా చిత్రబృందం సెన్సార్ పూర్తి చేసుకుందని.. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది. ఈ విషయంలో మీ సహనానికి, మద్దతుకు ధన్యవాదాలు అంటూ పోస్ట్ చేసింది. కాగా.. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జన్సీ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. దీంతో ఈ మూవీపై ఓ వర్గం సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమను చెడుగా చిత్రీకరించారంటూ ఈ చిత్రంపై ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా సెన్సార్ బోర్డ్ సైతం కొన్ని సీన్స్ కట్ చేయాలని చిత్రబృందానికి సూచించింది. అందువల్లే ఎమర్జెన్సీ వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకోవడంతో త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది.




printed& Published &edited by Chandra shekar vippala, from Adhya publications, hyderabad, phone no... 9951121243 (Trial version)